పంకజం-పనిమనిషి!

ముదిగొండ శివప్రసాద్

'ఏమేవ్ ! ఇలా రా ఒకసారి-' చదువుతున్న పుస్తకంలోనుంచి తల బయటకుతీసి కళ్లజోడు ముక్కుమీదికి లాగి పరబ్రహ్మం వేసిన కేకకు ప్రతిధ్వనేమో అన్నట్లు 'ఏమండోయ్ ఇలారండి ఒకసారి' అని కేకపెట్టింది పంకజమ్మ వంటిట్లోనుంచి—

'ఏమేవ్-ఇలారా ! ఉరుక్కొంటూ రా-పరుగెత్తుతూ రా... చూశావా-చూశావా-సావర్కార్ కూడా ఏమన్నాడో - ఇన్నాళ్ళ నుండి నేను చెపుతున్నదే ఆయనా ఈ పుస్తకంలో ఒప్పుకున్నాడు- ఆ రోజు రాత్రి వర్షం పడ్డదని నేను అనలేదూ ... అదే నిజం - ఈయన

వర్షం పడ్డదనే అన్నాడు...ఇదుగో ఇలా — రా. ఇంకా రాలేదేమిటి ?'

'ఇదుగో ఇలారాండీ – నేను మొదటి నుంచి మొత్తుకొటుంటే విన్నారా, వాడు చేరిననాడే దొంగవెధవ – వాడి చూపులే అదోలా వున్నాయని అన లేదూ-నిన్న జీతం తీసుకున్నాడు పత్తా లేదు—ఇవ్వాళ స్టీలు గ్లాసు కన్పించడం లేదు.' పంకజమ్మగారు వంటింట్లోంచి కేక.

పరబ్రహ్మం చేతిలో పుస్తకం టేబిల్ మీద పెట్టి, కొండ మహమ్మద్ దగ్గరకి రాకపోతే తానే కొండ దగ్గరికి పోయి నట్లు కంగారుగా వెళ్లాడు.

'ఏమేవ్ - విన్నావా – చూడు ఇంత కాలం నేను వాదిస్తున్న దానికి ఆధారం కన్పడింది. సోపపత్తికంగా సప్రమాణంగా నిరూపణ కన్పడింది అందు లోనూ వాళ్లూవాళ్లూ కాదు సాక్షాత్తు సావర్కారే అన్నాడే – ఆ రోజు రాత్రి వర్షం పడిందని–'

'ఏ రోజండీ.'

'అదే ! అలగ్జాండరూ — పురుషోత్త ముడూ యుద్ధం చేశారే—ఆ క్రితంరోజు రాత్రి పెద్ద వర్షం పడింది. ఆ వర్షం అల గ్జాండరు గుర్రాలకుఇబ్బంది-ఏనుగలకేం మత్తేభాలు-హాయిగా తొండాలెత్తుకొని పోతాయి–'

'ఇంతకూ మీరనేదేమిటండీ'

'అనేదేముందీ – ఆ యుద్ధంలో ఓడింది పురుషోత్తముడు కాడూ – అల గ్జాండరేననేది సిద్ధాంతం...' 'బాగుంది-మీరూ మీ సిద్ధాంతాలు - రెండువేల ఏళ్ల కింద ఎవరు ఓడారూ, ఏనాడు వర్షం కురిసిందీ ఇన్నదాన్ని గూర్చి కలలు కంటూ కూర్చోండి – ఇక్కడ ముందు స్టీలుగ్లాసు కన్పించటడంలేదు.'

'ఏం స్టీలుగ్లాసు...'

'ఆ పెద్ద కాఫీస్టీలు గ్లాసు...'

'ఎక్కడవుంది ?'

'అది తెలిస్తే మిమ్మల్ని నేనెందుకు కేకవేసి పిలుస్తాను ? నిన్నటి పనివాడు చెంగయ్యే తీసుకుపోయి వుంటాడు–వాడి చూపులు చూసే అనుకున్నాను వట్టి దొంగవెధవని' – 'అబ్బే ! అలా తొందర పడకు పంకజం– పని మనుష ల్నందరని దొంగలనీ సోమరిపోతులనీ అనడం మన కలవాటయిపోయింది–నిదానంగా వెతుకు-ఏ బాతురూంలోనో ఏ నందివర్ధనం చెట్టు మొదట్లోనో దొరికి తీరుతుంది చివరకు.'

'అవునులెండి – నా జాతకమదేమో కాని ఎప్పుడూ ఆ పనిమనుషుల్ని వెన కేసుకొని వచ్చి ఇంట్లోవాళ్లని నానా మాటలు అనడమే తప్ప వాళ్లెందుకు చెప్పారు – ఇందులో నత్యా సత్యాలు ఏమిటీ అని ఎప్పుడైనా ఆలోచించిన పాపాన పోయినారా ! ఎప్పుడైనా పని మనుషులతో దెబ్బలాట వస్తే నా మీద రవ్వంతైనా సానుభూతి చూపారా ?'

"ఇందులో సానుభూతి సమస్య ఏముంది పంకజం-వాళ్ళు పనిమనుషులు- ఏదో నౌకరీచేసుకొని డబ్బులు సంపాదించుకొంటారు—మనం నౌకరీ చేయించుకొని డబ్బులు పారేస్తాము. అంతే సంబంధం-దానికిగాను వాళ్ళమీద అభాండాలు వేసి అత్యాచారాలుచేసి మన ప్రతి లోపానికీ పనిమనుషులను తిట్టడం బాగా లేదు."

"ఇది నా ఖర్మం-అయినా మిమ్మల్ని పిలిచి చెప్పడ మేమిటి నేను—పోయి ఓ లేబర్‌పార్టీ పెట్టుకోండి. పది ఓట్లు పడి ఎం.ఎల్.ఏ. అయితే ఈ ముష్టి టీచర్ ఉద్యోగానికన్నా లాభసాటిగా వుంటుంది. వెళ్ళండి-వర్షంలో అలగ్జాండరు గుర్రాలు బురదలో కూరుకుపోతే వాటిని ఎలా బయటకులాగారు? చేంతాడులు కట్టారా? లేక మనుషులు నాలుగువైపులాపట్టుకొని మోశారా?- పోయి అధారాలు పరిశీలించండి..." విసురుగా అవతలి గదిలోకి పోయింది పంకజమ్మ!

పరబ్రహ్మం మరేం మాట్లాడకుండా మళ్ళా తన రీడింగ్‌రూంలోకి వెళ్లి కూర్చున్నాడు.

పంకజమ్మ పనిమనుషులమీద నేరారోపణలు చేయడం ఇది మొదటిసారి కాదు. తన్మూలంగా యింట్లో పోట్లాటలు రావడమూ ఇది ప్రథమంకాదు.

ఒకసారి స్టీలుస్పూను కన్పించలేదని యాదయ్యను మాన్పించింది పంకజం. తీరాచూస్తే ఆ స్పూను మర్నాడు పక్కవారి గోడపైకాకి పెట్టినట్లుతేలింది.

మరోసారి అయిదు రూపాయల నోటు కన్పించలేదని చంద్రయ్య మీద నేరారోపణ.

వాణ్ణి అడ్డమైన తిట్లూ తిట్టి, నాలుగు తగిలించి 'నిజం చెప్పు - మేము ఏమీ అనము' అని బలవంతంపెట్టగా పెట్టగా చివరకు నేనే తీసుకున్నాను బాబో-క్షమించండి' అని ఏడుస్తూ పారిపోయాడు.

మర్నాడు పనిలోకి రాలేదు-"వెధవ, జీతం ఎట్లా తీసుకుంటాడో చూస్తాను-" అని మండిపడింది పంకజం!

తీరా విచారిస్తే పెద్దవాడు రామూ ఆ అయిదు పట్టుకుపోయి సినిమాకు ఖర్చు పెట్టాడని తేలింది -

ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయి ఇంట్లో -

అందుకే పరబ్రహ్మానికి పంకజం పనిమనుషుల గూర్చి ఎప్పుడు ఫిర్యాదు చేసినా తొందరపడకూడ దనిపించేది - దానికి తగ్గట్టే జరిగేది కూడాను.

అలాగని పనిమనుషులంతా దేవతలనీ ఆకాశంనుంచి మన ఇళ్ళను తీర్చి దిద్దడానికి దిగివచ్చిన గంధర్వులని కూడా పరబ్రహ్మం భావంకాదు. వాళ్లు దొంగతనాలు చేయడాలూ, బియ్యమూ, సామానులు చాటుగా మోసుకుపోవడాలూ డబ్బు తీసుకుపోవడమూ - అన్నీ జరుగుతున్నవే! అలాగని తొందరపడి ప్రతి

మనిషినీ దొంగగా బ్రాండ్ చేసి పీకేస్తే నష్టపడేది ఎవరు ?? ఇదీ పరబ్రహ్మం వాదం -

తనకు తెలుసు ఈ పాటికి చెంగయ్యే నప్పుడే పంకజమ్మ డిస్మిస్ చేసి వుంటుంది -

మళ్ళీ పనిమనిషి సమస్య మొదలు -

అసలీ పనిమనుషుల మీదన్నే రీసెర్చి చెయ్యాలనుకున్నాడు పరబ్రహ్మం - అందుకు కావలసిన పాయింట్లు కూడా కొన్ని వ్రాసిపెట్టుకున్నాడు. అయితే ఒక సారి అది పంకజమ్మ కళ్ళలో పడటం మూలంగాఅర్థాంతరంలోనే ఆగిపోయింది.

'మీ పరిశోధనలూ ఉపపరిశోధనలూ మాని, ముందు ఓ పనిమనిషిని వెతుక్కు రాండి. పొద్దుటి నుంచీ చేసుకోలేకుండా వున్నాను' అని తన్ను బయటకు పంపి ఆ కాగితాలు దాచేసింది.

అందులో నిజానికి పరబ్రహ్మం రీసెర్చికి కావలసిన ప్రాథమికాంశాలన్నీ సేకరించాడు.

పనిమనుషులనేవారు ఒక కులానికీ వర్గానికీకూడా చెందివుండరు. వాళ్ళల్లో రూపాలలోనూ గుణాలలోనూ కూడా సామ్యం వుండదు.

వివిధ కులాలకూ తరగతులకూ చెందినవారు పనిమనుషులుగా వస్తారు.

చాలామందిలో వుండే స్వభావ సిద్ధ గుణం ఏమంటే సాధ్యమైనంత తక్కువ పనిచేసి ఎక్కువ మూటకట్టుకొని పోవాలని వుంటుంది.

ఎంతకూ సంతృప్తి వుండదు.

ఈమాటే ఓసారి పంకజం ఓ పనిమనిషితో అంటే ఆ పనిమనిషి అడగవలసిన నాలుగూ అడిగాడు.

"ఇదిగో పంకజమ్మగారూ - నేనేం మీ ఇంట్లో పనిమనిషి ననుకున్నారా లేక బానిస ననుకున్నారా - ఆ మాట కొస్తే మీ ఆయన మాత్రం పనిమనిషే గదా? నేను చిన్నపనిమనిషినైతే ఆయన పెద్ద పనిమనిషి - నాకు సంతృప్తి లేదంటారు. ఎవరి కుందండీ ఈ కాలంలో - తక్కువ పనిచేసి ఎక్కువ జీతాలు గుంజాలనేగా అందరి పాలసీ. అసలు పని చేయకుండానే జీతాలు గుంజేవారి మాటేమిటంటారు? నే నింకా శ్రమజీవినండీ. మాటంటే పడను-' అని ఇలా ప్లీడరు పాయింటు తర్వాత పాయింటువాదిస్తుంటే పరబ్రహ్మం విని "ఔరా" అని నివ్వెరపోయిన రోజొకటి లేకపోలేదు.

అయితే అలా వాదించే మనుషులు నూటికి కోటికి ఒకరు అరుదుగా దొరుకుతారు తక్కిన వారంతా సామాన్యంగా 'నస' పెట్టడమో గొణగడమో చేస్తుంటారు. లేదా ఓపికున్నంతవరకూ చేసి అందినంతవరకూ మూటకట్టుకుని చెప్పకుండా చెక్కేస్తుంటారు.

'ఏమండీ ఆ చెంగయ్య కనిపించడం

లేదు. మళ్ళీ రీడింగ్‌రూంలోకే చేరారా ఏమిటి!' పంకజం కేకతో ఉలిక్కిపడి వాస్తవలోకంలోకి వచ్చాడు పరబ్రహ్మం!

మళ్ళీ పెద్ద సమస్య!

ఎ బిగ్ క్వశ్చన్ మార్క్!!

పనిమనిషి! సర్వెంట్ మెయిడ్!!

చరిత్రపుస్తకమూసి చెప్పులు తొడుక్కొని ఇంట్లోనుంచి గుమ్మంలోకివచ్చి నిలబడ్డాడు పరబ్రహ్మం!-

రోడ్డుపై జనం అలా పోతున్నారు ఎవరి పనులకు వాళ్లు ఆదరాబాదరా.

ఎంతమంది జనం - ిన్ని రిక్షాలు - సైకిళ్లు! వీళ్ళల్లో పనిమనుషు లెవరో ఎలా పట్టుకోవడం??

ఏ పరీక్షతో ముందు నిర్ణయించడం?

పరబ్రహ్మం ఆ దిక్కూ ఈ దిక్కూ చూచి పక్కనున్న కూర్మావతారంగారింటికి పోయాడు

"రండిరండి పరబ్రహ్మంగారూ - ఏమిటి ఇలా వచ్చారు విశేషం."

"ఏముంది - మా పనిమనిషి పారిపోయిందండీ."

"శుభం!— కూర్చోండి. సమయానికే వచ్చారు నేనూ పనిమనుషుల సమస్య ఆలోచిస్తున్నాను."

"ఆలోచిస్తే లాభంలేదు. అవతల మా ఆవిడ పనిచేసుకోలేక చిందులు తొక్కుతున్నది. ఉన్నవాడికి దొంగతనం అంటగట్టేసరికి చెప్పకుండా పారిపోయాడు."

"పోనీలెండి దిగులు పడవద్దని చెప్పండి. మరో అర్ధగంటలో మీ ఇంటికి పనిమనిషి వస్తుంది, వెళ్ళండి."

"ఏం కూర్మావతారంగారూ, నిక్కచ్చిగా చెప్పగలుగుతున్నారు."

"అవును - ఇందాకనే మా ఇంట్లో రంగడు తన భార్య లచ్చికి పని చూపించండి ఎక్కడైనా అని చెప్పాడు."

"సరే నన్నాను. ఈ సంభాషణ అటు జరిగిందో లేదో ఇటు మీరువచ్చారు దైవవశాత్తు, ఇప్పుడే రంగణ్ణి పంపి లచ్చిని పిలిపిస్తాను పదండి."

పరబ్రహ్మానికి కలయో వైష్ణవ మాయయో అన్నట్లుంది ఇదంతా. పని మనిషి ఇంత త్వరగా నిమిషాలమీద మళ్ళీ దొరుకుతుందని మాత్రం అనుకోలేదు పొరపాటున కూడా.

"ఏమేవ్ ఏంచేస్తున్నావ్. ఇదిగో పని మనిషి వస్తున్నది. చూశావా - పిలుచుకొచ్చాను. కుదుర్చుకొచ్చానే."

"ఏమిటండీ"

"అవునే-పనిమనిషి దొరికింది."

"ఆహా-ఎవరూ - ఏమిటీ."

"మన కూర్మావతారంగారింట్లో పని చేస్తాడే రంగడు వాడి భార్యట!"

"ఎలా చేస్తుందిట పని"

"ఏమో మరి-"

"నటుగుడూ దొంగబుద్ధులూలేవుగా"

"తెలియదు"

"ఎంత ఇవ్వాలని అడిగారు."

"ఇంకా అడగలేదు."



"ఇంతకు ముందు ఎవరి ఇంట్లో చేసిందో"

"తెలియదు."

"మరేమిటండీ మీరు తెలుసుకు వచ్చింద''-

"రంగడి పెళ్ళాం పనికి వస్తుందని''

"రంగడు - బుంగడు-వాడే మనకు తెలియదే వాడి పెళ్ళాం అంటే అదేం సర్టిఫికెట్టు ?"

"నిజమే సుమా!'' భార్య అన్నదాన్లో కూడా పాయింటు లేకపోలేదనిపించింది పరబ్రహ్మానికి !

"తొందరపడకే వస్తుందిగా - అన్నీ మాట్లాడుకోవచ్చు అప్పుడు"

పంకజం ఎందుకో ఒక్క-క్షణం'సరే' లెమ్మన్నట్లు తలవూపి కాస్త ఆగింది.

మళ్ళీ అన్నది ''ఇదిగో ముందే సిక్క-చ్చిగా మాట్లాడాలి అన్నా. మంగళవారం శుక్రవారం ఇల్లంతా కడగాలి."

"అలాగే"

"గదులన్నిటికీ ఫ్లిట్టు కొట్టాలి. వెంట వెంట బూజులూ గట్రా దులుపుతూ వుండాలి '

"బూజు దులుపుతుందిగాని, గట్రా ఎలా దులుపుతుంది?''

"ఇదుగో నాకు కోపంతెప్పించకండి. మీరూ మీ పరాచికాలూను. అన్నీ ముందే మాట్లాడుకోకపోతే నెత్తినెక్కి కూర్చుంటారు తెలుసా? తర్వాత...''

"అలాగే"

"రామూకు సమస్తం అందించాలి. మీకు నీళ్లు అవీ తోడిపెట్టి పిలిస్తే పలికేటట్లుండాలి. విజ్జీగాడిని అలా వీధులు తిప్పి ఆడించుకురావాలి. లీలకు తల

దువ్వి జడవేసి స్కూలు దగ్గర దింపి రావాలి. ఇవన్నీ ముందే మాట్లాడండి - తెలిసిందా ?''

"తెలిసింది. కాని ఇంట్లో సమస్తం చేయాలంటున్నావు నిజ్జీని వీధుల్లో తిప్పాలంటున్నావు. ఒకే మనిషి ఇంట్లోనూ వీధిలోనూ కూడా ఎలా వుండగలదంటావు కామరూపం లేకుండా''

"రామచంద్రా-రామచంద్రా ; ఈయనతో నేను వేగలేను తండ్రీ..."

"ఆఁ-ఆఁ చెప్పు-చెప్పు."

పంకజమ్మ కోపం కొంచెం తగ్గాక మొదలెట్టింది

"సర్ఫ్ పౌడి మళ్ళీ మళ్ళీ అడగకూడదు. చింతపండు ముద్దలుముద్దలు కావాలనగూడదు,"

"అలాగే"

బట్టలు మల్లెపూలలాగుండాలి. అంట్ల గిన్నెలు ధగధగ మెరిసిపోతూండాలి."

"అలాగే"

"నాలుగురోజులుచేసి ఎగగొడితే ఒక రోజుకు రెండు రోజుల జీతం కోస్తాను"

"ఊఁ''

"చేరీచేరక ముందే ఎడ్వాన్సు అడగకూడదు.''

"అలాగే అడగను''

"ఏమిటండీ అదీ"

"అవును పంకజం. ఏ ఐ. సి. ఎస్. పరీక్షకు వస్తున్న అభ్యర్థిని అడిగినట్లు అవన్నీ ఆ వచ్చిన పనిమనిషి నడుగు. ఆమెకే చెప్పు. నన్నడిగితేనేనేంచెప్తాను.''

"చాల్లెండి. మీరూ మీ మాటలూ..."

"పంకజం ! అన్నానని కోపం తెచ్చుకోకు. మనిషిని వంగిన నడుం ఎత్తకుండా ఊపిరిపీల్చుకోకుండా ఎలా పిండి వేయాలో మీ నాయనకు బాగా తెలుసు. అయితే ఆయనకు ఆఫీసువారిచ్చిన నౌకరు వున్నాడు. దానితోబాటు ఆఫీసులోని నౌకరును కూడా చూసీచూడకుండా స్వంతపనులకు వాడుకునేవాడు. కాని వాళ్ళంతా ఏదో పొట్టతాపత్రయం కోసం వచ్చే పనిమనుషులు. వీళ్ళనలా నల్లుల్లా నలపాలంటే సాధ్యపడదు పంకజం!"

"రామచంద్రా ! రామచంద్రా ! మళ్ళీ నన్నే అంటున్నారా...నన్నే..."

"నిన్ను కాదు పంకజం"

"నన్నే అంటారు. ఆ ముష్టి పనిమనిషిపాటి చెయ్యకపోయాను. ఛీ ! ఏం బ్రతుకు నాది'' విసురుకుంటూ లోపలికి పోయింది పంకజమ్మ !

* * *

"ఏమండోయ్ ! ఏం చేస్తున్నారు ?''

"ఏంలేదు. ఏదో వ్రాసుకుంటున్నాను.''

"ఇలా రండి ఓ సారి.''

"వస్తున్నా పంకజం''

"వద్దులెండి నేనే వస్తాను"

పంకజం వచ్చింది.

పరబ్రహ్మం కలం కాగితం పక్కకు

పెట్టి శ్రద్ధగా సర్వేంద్రియాలూ పంకజం వైపుకు కేంద్రీకరించి కూర్చున్నాడు.

"ఇదిగో. ఇది చూచారా"

"ఏదీ చూడలేదే!"

"ఖర్మా! ఖర్మ! ఈ లచ్చిని చూచారా?"

"ఏం చేసింది - ఏదైనా గ్లాసు..."

"ఏమిటండీ ఇది..." కసిరినట్లుగా అన్నది పంకజం!

"చెప్పుచెప్పు - లచ్చి అనేసరికి ఏం తీసిందోనని తెలియక తికమకపడ్డాను."

"చాల్లెండి మీరు"

"ఆ(- ఇంతకూ లచ్చి ఏంచేసింది? పని సరిగ్గాచేస్తున్నదా లేదా."

"అదేనండీ! చూసి రమ్మంటే కాల్చి వచ్చేటట్లున్నది ఇది."

"అంటే"

"పని చెప్పకముందే చేసేస్తున్నది.

ఒకటి చేయమంటే నాలుగు చేస్తున్నది. గుండెలదరిపోతున్నై దీని పనిమాస్తుంటే"

"ఇంకేం మరి పని నీకు నచ్చింది కదా!"

"నచ్చడ మేమిటండీ...అయినా దానికెందుకింత శ్రద్ధ పనిమీద అని నా కాశ్చర్యం కలుగుతున్నది."

"అదేమిటి పంకజం! మనం పైస లిస్తున్నాము, అది పనిచేస్తున్నది."

"ముష్టిపైసలు, జీతం కూడా బేరం చేసుకోకుండా చేరింది. పైసలు కోసమే ఇది ఇంతపని చేస్తున్నదంటే నేను నమ్మను"

"అయితే ఏమంటావు"

"అదే తెలియడంలేదు."

"పోనీ కొంచెం పరిశోధించు."

"చూడండీ. అది రామూ బూట్లకు పాలిష్ చేస్తూ అదోలా నవ్వుతున్నదండీ"

"పోనీ హసన్ముఖి! పాపం నగలు లేకపోతేనేం చిరునవ్వే ఆమెకు చంద్రహారం పంకజం"

"బోడినవ్వు - వేళాపాళా లేకుండా అలా నవ్వడం తప్పుకాదటండీ. ఎందుకు నవ్వాలి అలా?"

"బాగుంది. నవ్వును కూడా నువ్వు నిషేధిస్తావా ఏమిటి పంకజం! నన్ను చూచి కూడా పదిసార్లు నవ్వింది లచ్చి."

"మిమ్మల్ని చూచే."

"ఆ - నన్నుచూచే - ఊం నవ్వితే బాగా తెల్లగా ముత్యాల వరసలావున్నాయి దానిపళ్ళు. నవ్వినా అందంగా వుంది."

'అవ్వ-అవ్వ—'

'అలా పెదవులు నొక్కుకోకు పంకజం! నా కెందుకో లచ్చి చాలా మంచిపిల్లలా కన్పడింది - నిర్మలమైన చిరునవ్వుతో కూడిన ఆ మొఖం-సన్నగా సన్నజాజి తీగెలా చకచకా పని చేసుకుంటూపోయే దాని చురుకుదనం. మాటన్నా కూడా ఎగిరిపడకుండా తల వంచుకొని ఓపికతోపోయే దాని నేర్పూ ఓహో! లచ్చిలో చాలా అందమైన గుణాలున్నాయి పంకజం!'

పంకజం కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

రక్తంలో పోటు హెచ్చింది.

'ముష్టిపనిముండ! దీన్నిప్పుడే తరిమేస్తాను - ఇంట్లోంచి. నా కొంపకు ఎసరు పెట్టేటట్లు ఇది - ఇదీ దీని పనీ మండా.'

'అయ్యో! అయ్యో - బాగా చెయ్య లేదని అందరినీ మానిపిస్తే బాగా చేస్తోందని దానిని మానిపిస్తావా పంకజం.'

'మీరిక మాట్లాడకండి. బుద్ధిలేని పెద్దమనిషీ-పనిమనిషి నవ్వుపై పరిశోధన చేస్తున్నారన్న మాట మీ రిప్పుడు.' వణికిపోతున్నది.

పంకజం రక్తపోటు హెచ్చు స్థాయికి పోయింది!

పరబ్రహ్మం కంగారుపడి రామును కేకవేసి డాక్టరుకు కబురుపెట్టాడు.

* * *

'రాండి రాండి పరబ్రహ్మంగారూ' పుస్తకం పక్కన పెట్టి ఆహ్వానించాడు కూర్మావతారం.

పరబ్రహ్మం ముఖం వ్రేలవేసుకొని కూర్చున్నాడు

'అదేమిటండీ ముఖం తోటకూర కాడలా వేలవేశారు.. ఇదిగో ఇందులో డబ్ల్యు.ఆర్.ఇంగ్ ఈ "స్పూన్‌ఫీడింగ్" అన్న వ్యాసంలో ఏం చెప్పాడో చూచారా ?.'

'ఏం చెప్పాడు ?'

'ప్రాచీన మానవులు పచ్చిమాంసాన్నే పీక్కొని తినేటంత బలంగల పళ్లతో వుండేవారు కదా - ఈ చెంచాల యుగంలో ఎందుకని యవ్వనం రాక ముందే పళ్లు పీకి పళ్లు కట్టుకోవలసి వస్తున్నది ? అని ప్రశ్నవేసుకొని కేవలం సోమరితనమూ పని యెడల వైముఖ్యమే దీనికి కారణమనీ సుఖం పేర నాగరకత పేర అలసత్వానికి అలవడుటకు ఈ పతనానికి కారణమనీ వర్ణించాడండీ.'

'భేష్ ! దాన్నొకసారి మా ఆవిడకు వినిపిస్తే బాగుండును కూర్మవతారం గారూ...'

'అదేమిటీ రంగడి భార్యను పని లోంచి తీసేశారుట కదా ! రంగడు చెప్పాడు ఇందాక.'

'అదో కథ - తర్వాత చెప్తాను. ఆవిడ బి.పి. ఎక్కువై మంచంపై పడివుంది.'

'ఎందుకని ?'

'ఎందుకని అంటే నేనేం చెప్పను కూర్మావతారంగారూ. దాని ఖర్మ అది. డాక్టరు వచ్చి పరీక్ష చేసి మీరేం కంగారు పడకండి - మీ పనులన్నీ మీరే స్వయంగా చేసుకోండి. ఏ అనారోగ్యమూ వుండదు. చూడండి అదుగో ఆ పనిమనిషిని, ఎంత నవ్వుతూ ఆరోగ్యంగా కళకళలాడుతూ వుందో- మరి మీరు చూద్దామంటే కీళ్లు నొప్పులూ బి పి. ఎందువల్ల నంటారు ? అని అచ్చి తోనే డాక్టరు కూడా మళ్లీ పోలిక తెచ్చే సరికి పంకజం బి.పి. పట్టశక్యం కాకుండా పైకిలేచిపోయిందికూర్మావతారం గారూ.'

'అరెరే ! పదండి నేనూ వచ్చి చూస్తాను.'

'ఫరవాలేదులెండి... ప్రస్తుతం కాస్త ఫరవాలేదు. లేచి కూర్చొని అచ్చిని ముందు పనిలోంచి తరిమేసి ఓ ప్రతిజ్ఞ పట్టింది'

'ఏమని'

'పని మనిషి అనే పేరు గల జీవిని, గుమ్మంలోకి ఇక తన జన్మలో రానివ్వనని'